
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 3 మార్చి 2024



రక్తం కాదు.. నీరు పారిస్తా..

గెలుపుపై ఫోకస్ పెట్టాలి

పల్నాడులో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రా కదలిరా.. సభ అనంతరం శనివారం రాత్రి ఆయన దాచేపల్లిలో బస చేశారు. ఈ క్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, గురజాల ఇన్‌చార్జి యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను పిలిపించుకుని గెలుపునకు సంబంధించి వారికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల్లో విజయానికి సంబంధించి జీవీ, యరపతినేనిలను సమన్వయం చేసుకోవాలని లావుకు సూచించినట్లు సమాచారం.


చంద్రబాబుకు వెంకటేశ్వరుడి చిత్రం పటం అందజేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, తనయుడు నిఖిల్


సభకు హాజరైన జనసందోహం

- వైసీపీ నరహంతకులను వదలిపెట్టం
- సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- కష్టపడండి.. భవిష్యత్‌కు బంగారు బాట వేస్తా
- దాచేపల్లి రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు

పిడుగురాళ్ల, దాచేపల్లి(నరసరావుపేట), గుంటూరు సిటీ, గుంటూరు(ఆంధ్రజ్యోతి), మార్చి 2: పల్నాడులో వైసీపీ రక్తం పారించింది.. దానిని ఆపేసి.. నీటిని పారిస్తాం.. పల్నాడుకు నీరందిస్తాం.. అని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. శనివారం దాచేపల్లిలో రా.. కదలిరా సభలో ఆయన ప్రసంగించారు. జగన్ పాలనలో పల్నాడులోని ఒక్క సాగు, తాగు నీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. వరికపూడిశెల అనుమతులు తీసుకువచ్చిన లావు శ్రీకృష్ణ దేవరాయలు పర్యవేక్షణలోనే ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి ఏడాదిలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. బుగ్గవాగు నుంచి పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణాలకు తాగునీరు అందిస్తామన్నారు. తంగెడ, కొత్తపల్లి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామ న్నారు. వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేసి ఇంటింటికి నీరు ఇస్తామన్నారు. గోదావరి నీటిని సాగర్ కుడికాలు వకు తలరించే ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేసి కరువు నివారిస్తామని తెలిపారు. పల్నాడు జిల్లాలో టీడీపీకి చెందిన 30 మందిని వైసీపీ ప్రభుత్వం హతమార్చిందని, ఒక్కరిని కూడా వదిలిపెట్టకుండా నరహం తకులను అణగతొక్కుతామన్నారు. కులం, మతం పక్కన పెట్టి, పల్నాడు పరిరక్షణకు కదలి రావాలని పిలుపిచ్చారు. పల్నాడు పౌరుషాన్ని, బ్రహ్మనా యుడుని స్ఫూర్తిగా తీసుకుని రానున్న 40 రోజులు కృషి చేసి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అహంకారంతో ఇష్టాను సారం రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చిందని తెలిపారు.


చంద్రబాబును సత్కరిస్తున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన

ఉప్పొంగిన జనసంద్రం

రా.. కదలిరా సభలో ఉప్పొంగిన జనసంద్రాన్ని చూసి చంద్రబాబు ఖుషీ అయ్యారు. యరపతినేని ఆధ్వర్యంలో జరిగిన సభ విజయవంతమైంది. సుమారు లక్ష మంది వరకు తరలివచ్చినట్లు తెలుస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా మహిళలు, యువకులు, రైతులు స్వచ్ఛందగా సభకు తరలి వచ్చారు. నేతలు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది సభకు హాజరయ్యారు. సభలో నేతలు, ముఖ్యంగా చంద్రబాబు ప్రసంగాలకు యువకులు, మహిళలు చాలా సందర్భాల్లో కేరింతలు కొట్టారు. జగన్‌ని చంద్రబాబు విమర్శించినప్పుడల్లా సభికులు ఈలలు వేశారు. మాచర్ల నియోజక వర్గంలో జరుగుతున్న అవినీతి, అరాచకం గురించి మాట్లాడినప్పుడు అనూ హ్యమైన స్పందన వచ్చింది. గురజాల యరపతినేని శ్రీనివాసరావు గురించి ప్రస్తావన రాగానే పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నాది.. పవన్‌ది ఒకటే దారి.. మా ఇద్దరి ఆలోచన ఒకటే అంటూ పవన్ గురించి చంద్రబాబు అన్నప్పుడు జనసేన కార్య కర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభకు అతి తక్కువ సమయం ఉన్నప్పటికీ ఏర్పాట్లు చేయడంలో యరపతినేని వెనకడుగు వేయలేదు.

యరపతినేనిని మరిచిపోను

పల్నాడు జిల్లా వైసీపీ అరాచకాలను ఎదుర్కొంటూ ధీటుగా పోరాడుతున్న గురజాల ఇన్‌చార్జ్ యరపతినేని శ్రీనివాసరావుని తాను ఎప్పుడూ మరిచిపోనని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబునాయుడు స్పష్టం చేశారు. శనివారం రాత్రి దాచేపల్లిలో రా... కదలి రా సభలో చంద్రబాబు ఈ ప్రకటన చేయగానే సభా ప్రాంగణమంతా హర్షధ్వానాలతో మారుమోగింది. యరపతినేని జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. మై ఎమ్మెల్యే ఈజ్ యర పతినేని అంటూ పోస్టర్లు ప్రదర్శించి ఉత్సాహం చాటారు. చం ద్రబాబు మాట్లాడుతూ యరపతినేని ఇక్కడే ఉండి పోరాడుతు న్నారు. 13 మందిని చంపారని ఆయన పడిన ఆవేదన వర్ణనాతీతం. ఆ బాధ అంతా నా కళ్ల ముందు కదులాడుతున్నది. టీడీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకొనేందుకు యరపతినేని త్యాగాలు చేస్తున్నారు. అలాంటి యరపతినేనిని తాను మరిచి పోనన్నారు. అలానే జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా వీరోచితంగా పోరాడుతున్నారు. మాచర్లలో ఈ దఫా ఆయన గెలుపు తథ్యమ న్నారు. అలానే జీవీ ఆంజనేయులు పల్నాడులో సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు నూటికి నూరు శాతం టీడీపీ జనసేన గాలి వీస్తున్నది. రాబోయే రోజుల్లో ఇది తుపానుగా మారుతుంది. ఎవరైనా వస్తే కొట్టుకుపోతారని హెచ్చరించారు.

అరాచక రాజ్యం పోవాలి

పల్నాడులో అరాచక రాజ్యం పోవాలి. ప్రజా రాజ్యం రావాలి. మాచర్లలో మారీ చుడు చేయని దోపిడీ.. కబ్జా ఉందా? గ్రానైట్ లారీలకు కప్పం కట్టాల్సిందే. మాచర్ల వీడి అబ్బ సొత్తా.. ఎస్సీ ఎమ్మెల్యేలను మారుస్తున్న జగన్‌కు మాచర్ల ఎమ్మెల్యేను మార్చే దమ్ముందా. ఎమ్మెల్యే తమ్ముడి దందాలు, అక్రమాలు, మద్యం, రేష న్ మాఫియాకు అడ్డేలేదు. ఇంత జరుగుతుంటే జగన్ ఏం పీకుతున్నాడు. ఎమ్మెల్యే 140 ఎకరాలు పోరంబోకు భూమిని, చివరకు దేవాలయం భూమిని కూడా కబ్జా చేశాడు. అక్రమార్జనతో హైదరాబాద్‌లో ప్యాలెస్ కడుతున్నాడు. మాచర్లకు బ్రహ్మారెడ్డి వచ్చారు.. పులి లాగా తిరుగుతు న్నాడు. పులిని చూసి మేకలు పారిపోతున్నాయని చంద్రబాబు తెలిపారు.

గురజాలలో కాసుల మహేష్‌రెడ్డి పేరు సార్థకం చేసుకున్నాడు. సున్నపురాయి, ముగ్గురాళ్ల వ్యాపా రులు, గ్రానైట్ లారీలు కప్పం కట్టాల్సిందే. దోచిన సంపాదనతో నరసరావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నాడు.

వినుకొండలో బొల్లా లెక్క తేలుస్తాం. వినుకొండను పిండుతున్న అనకొండ ఆయన. ముస్లిం, వైశ్యుల భూములను కబ్జా చేశాడు. బినామీ పేర్ల తో పొలాలు కొని అధిక ధరకు ప్రభుత్వానికి ఇచ్చి రూ.100 కోట్లు దోచుకున్నాడు. గిట్టుబాటు ధర కావాలని అడిగిన రైతును చెప్పుతో కొడతానని బెదిరించాడు.

చిలకలూరిపేటలో రజని సైబారాబాద్ మొక్క. ఈమే సీటును చింపేశారు. గుంటూరు నుంచి పోటీచేయబోతున్న రజని అక్కడ కూడా ప్యాకప్పే. ఈమె మళ్లీ సైబరాబాద్‌కే పోతుంది.

అంబోతు అంబటి సత్తెనపల్లిలో రంకెలు వేస్తాడు. ఇరిగేషన్ మంత్రిగా ఒక్క పిల్ల కాల్వ కూడా తవ్వించలేదు. నన్ను, పవన్ కల్యాణ్‌ను విమర్శించడమే ఆయన పని. శాశ్వతంగా రంకే వేయకుండా చేస్తాం.

పెదకూరపాడులో శాండ్ శంకర్రావు ఇసుక మాఫియా నడుపుతున్నాడు. కొట్టేసిన సొమ్ములో జగన్‌కు వాటా ఇస్తున్నాడు. 400 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించాడు.

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి అరాచకవాది. ప్రతి పనికి పర్సంటేజ్ ఇవ్వాలి. అయనకు కప్పం కట్టందే ఏ పని కాదు.


వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు



ఫ్యాక్షన్ కాదు.. అభివృద్ధి చేస్తాం



పల్నాటి పౌరుషంతో అభివృద్ధిని చేసి చూపుతామే తప్ప ఫ్యా క్షన్ రాజకీయాలకు పాల్పడబోము. పగ, ప్రతీకారాలతో ప్రత్య ర్థులను ఇబ్బంది పెట్టడం తప్ప వైసీపీ నేతలకు అభివృద్ధి తెలియదు. ఐదేళ్లు అవుతున్నా ఇంకా కొన్ని గ్రామాల్లోకి టీడీపీ శ్రేణు లు రాలేకపోతున్నారంటే వైసీపీ నేతలు ఎంత భయపెట్టారో అర్థమవుతుంది. కార్యకర్తలకు అవమానం జరిగిన చోటే వారు కాలర్ ఎగరేసేలా చేస్తా. రేపటి ఎన్నికలలో చంద్రబాబు పాలన వస్తేనే ప్రతిఒక్కరూ సంతోషంగా ఉంటారు. టీడీపీ హయాంలోనే పల్నాడు అభివృద్ధి జరిగింది.

- యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే

పల్నాటి పౌరుషం చూపాలి



రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించి పల్నాటి పౌరుషాన్ని చాటాలి. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాలి. మంచినీళ్లు అడిగిన ఎస్టీ మహిళను ట్రాక్టర్‌తో తొక్కి చంపించారు. తోట చంద్రయ్యను చంపించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి రానున్న రోజుల్లో రూపాయికి రూపాయిన్నర వడ్డీతో చెల్లిస్తాం. వరికిపూడిశల ప్రాజెక్టుతో పీ ఆర్కే నాటకాలు ఆడుతున్నారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుదే. ఈ విషయంలో ఆయన్ను అభినందించాలి. **- జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు**

రాష్ట్రంలో రాక్షస పాలన



రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుంది. వైసీపీ పాలనను అంతమొందించేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ వారిపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైలు పాలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరం. **- ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి**

ఎంపీగా పల్నాడు అభివృద్ధికి కృషి



ఎంపిగా ఉన్నంతకాలం పల్నాడు అభివృద్ధికి కృషి చేశాను. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ, అటవీశాఖల అనుమతులను తీసుకొచ్చా. కేంద్ర ప్రభుత్వ నిధులతో బ్రాహ్మణపల్లిలో మెడికల్ కళాశాల, నకరికల్లు వద్ద ఇజ్రాయేలు సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ప్రాజెక్టు, రూ.500 కోట్లతో జలజీవన్ పథకం, మాచర్లలో కేంద్ర విద్యాలయం సాధించాను. కేంద్రం నిధులతో 400 కిలోమీటర్ల దూరం పొలంబాటలు వేయించాను. అమరావతి రాజధానిని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. **- లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ**

రాష్ట్రంలో సైకో పాలన



రాష్ట్రంలో సైకో పాలన సాగుతుంది. పల్నాడులో వ్యక్తుల ప్రాథమిక హక్కులకు కూడా భంగం కలుగుతుంది. తండ్రి పేరు చెప్పుకుని ఒక్క చాన్స్ పేరు తో జగన్ అధికారం చేపట్టి అరాచకం చేస్తున్నారు. 100 ఇచ్చి వెయ్యి రూపాయలు లాగేస్తున్న జగన్‌ను ఈసారి ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. షర్మిల, సునీత ప్రశ్నలకు జగన్ ముందు సమాధానం చెప్పాలి. దేవుడిని కూడా వదలకుండా టెంకాయల రూపంలో దోపిడీ చేస్తున్నారు.

- జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాచర్ల అభ్యర్థి



దొంగల ముఠా లీడర్ జగన్



జగన్ ఒక నియంత. బ్రిటీష్ వారిని తలపించేలా పాలన చేస్తున్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చి అధికారం చెలాయిస్తున్నాడు. దేశంలోనే అధిక సంపన్నుడు కావాలనే ఆశతో అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పాడు. దొంగల ముఠాకు లీడర్ జగన్. కులాలు, మతాలు, పార్టీలను కూడా వదిలిపెట్టడం లేదు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే జగన్ పూనుకున్నాడు.

- కన్నా లక్ష్మీనా రాయణ, మాజీ మంత్రి

వైసీపీతో పదేళ్లు వెనక్కి



వైసీపీ పాలనతో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. పల్నాడులో వైసీపీ నేతలు ఏడాదికి మూడు వేల కోట్ల అవినీతి సంపాదన మరిగారు. పెదకూరపాడులో నెలకు 30 నుంచి 40 కోట్ల ఇసుక దందా జరుగుతుంది. వరికిపూడిశెల పూర్తి చేసి 2024లో ఓట్లు అడుగుతానన్న పిన్నెల్లి ఇప్పుడేమి సమాధానం చెబుతాడు.

- గాదె వెంకటేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు




మహిళల నినాదాలు



చంద్రబాబుతోనే భవిష్యత్

రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. చంద్రబాబు సీఎం అయితే తప్ప రాష్ట్రానికి వెలుగు రాదు. పోలవరం, వరికపూడిశెల ప్రాజెక్టులు పూర్తి చంద్రబాబుతోనే సాధ్యం. వరికపూడిశెల ప్రాజెక్టు సాధనకు కృషి చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు టీడీపీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవాలి. వైసీపీ నేతలు భాష మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు.

- మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే



వైసీపీ ఓటమి ఖాయం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ఓటమి ఖాయం. ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి. టీడీపీని గెలిపించి వైసీపీని సాగనంపేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారు.

- కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే



రాష్ట్రంలో కులాల కుంపటి

కులాల కుంపటితో రాష్ట్రంలో జగన్ పాలన సాగిస్తున్నాడు. పల్నాడులోనూ కుల రాజకీయం చేస్తున్నాడు. టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.

- బోనబోయిన శ్రీనివాసయాదవ్, జనసేన నేత





రాష్ట్రంలో దుష్టపాలన

ఓటమికి జగన్ సిద్ధమవ్వాలి. వైసీపీని ఇంటికి పంపేందుకు టీడీపీ సంసిద్ధంగా ఉంది. రాష్ట్రంలో వైసీపీ పాలన దుష్ట పాలనను మైమరిపిస్తోంది.

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట ఇన్‌చార్జి





తుళ్లూరు రైతు ధర్నా శిబిరం వద్ద దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం

● 1537వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి2: సీఎం జగన్‌రెడ్డి దెబ్బకి రాష్ట్రం 20 సంవత్సరాలు వెనకడి పోయిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1537వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ మూడు రాజధానుల అవసరం లేకపోయినా సొంత ప్రయోజనాల కోసం బలవంతంగా రుద్దాలని పాలకులు చూస్తున్నారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతి అని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. మూడు ముక్కలాట సీఎం జగన్‌రెడ్డి ఇక ముగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం వేళ దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో బిల్డ్ అమరావతి అంటూ రైతులు నినాదాలు చేశారు.

దాచేపల్లి.. దద్దరిల్లే

- జనసంద్రం.. జయకేతనం
- చంద్రబాబు సభ సూపర్ హిట్
- సభకు జనం పోటెత్తారు
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- అధినేత చంద్రబాబు ప్రసంగానికి విశేష స్పందన

పిడుగురాళ్ల, దాచేపల్లి (నరసరావుపేట), మార్చి 2: గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభ సూపర్ హిట్ అయింది. అధికార వైసీపీ నేతల బెదిరింపులు.. మంద టెండను లెక్కచేయక జనం దాచేపల్లి వైపు అడుగులు వేశారు. తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు కలికట్టుగా కదం తొక్కారు. దాచేపల్లిలో శనివారం నిర్వహించిన రా.. కదలిరా సభ జనసంద్రంగా మారింది. సభా ప్రాంగణం కిటకిటలాడింది. ప్రభుత్వం బస్సులు కేటాయించకపోయినా, పోలీసులు సరైన భద్రత కల్పించకు న్నా.. ప్రైవేట్ వహనాలపై ఆంక్షలు విధించినా టీడీపీ, జనసేన అభిమానులు ప్రత్యామ్నాయ మార్గాల్లో సభా ప్రాంగణానికి భారీగా చేరుకున్నారు. జిల్లా నలుమూల నుంచే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. సభా ప్రాంగణంలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. ప్రాంగణంలో బారికేడ్లను తొలగించుకొని వేదిక వద్దకు వచ్చి కేరింతలు కొట్టారు. అధినేత చంద్రబాబు అభివాదం చేస్తున్న తరుణంలో పార్టీ శ్రేణులు, అభిమానులు జై చంద్రబాబు.. సీఎం నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది.

చంద్రబాబు ప్రసంగం మొదలుపెట్టినప్పటి నుంచి కార్యకర్తలు, జనం నినాదాలు హోరెత్తించారు. చంద్రబాబు జగన్‌పై విమర్శలు చేస్తున్నపుడు హర్షాతిరే కాలు వ్యక్తం చేశారు. సైకో పోవాలి అంటూ చంద్రబాబు నినా దం చేస్తుంటే భారీ స్పందన వచ్చింది. మీ భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన ప్రభు త్వం రావాలి. అందుకోస మే కూటమిగా ఏర్పడిందని చంద్రబాబు చెప్పారు. వైసీపీ అరాచకపాలనపై ధ్వజమెత్తారు. జిల్లాలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అవి నీతిని తూర్పారపట్టారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి ప నులను వివరించారు. చంద్రబాబు ప్రసంగం అద్యంతం అభిమానులను ఉర్రూతలూగించింది. చంద్రబాబు జగన్‌పై సంధించిన విమర్శనాస్త్రాలకు.. కేకలతో ప్రాంగణం మార్మోగింది. టీడీపీ, జనసేన పొత్తు బంపర్‌హిట్ అనడంతో సభలో అభిమానులు కేరింతలు కొట్టారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడేటప్పుడు ప్రజలనుంచి మంచి స్పందన వచ్చింది.



ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు, అభిమానుల కేరింతలు

సత్తా చాటిన యరపతినేని...

సభ విజయవంతం చేయడం ద్వారా గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సత్తాచాటారు. అధినేత మన్ననలను ఆయన అందుకున్నారు. జిల్లా నుంచి ఎంతమంది అభిమానులు తరలివచ్చారో.. ఒక గురజాల నియోజకవర్గం నుంచే అంతమంది తరలివచ్చారు. ఇంతటి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను యరపతినేని కేవలం 48 గంటల్లోనే పూర్తిచేయడం విశేషం. భారాన్ని మొత్తం తన భుజస్కందాలపై వేసుకొని ఏర్పాట్లు చేయించారు. నియోజకవర్గంలోని ఊరూవాడ సభకు కదలిరావడం వెనుక యరపతినేని శ్రమ ఎంతో ఉంది. సభకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అధ్యక్షత వహించగా మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, నన్నపనేని రాజకుమారి, ఆలపాటి రాజేంద్రప్ర సాద్, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, గొట్టిపాటి రవికుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, కొమ్మాలపాటి శ్రీధర్, భాష్యం ప్రవీణ్, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, జనసేన నేతలు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస యాదవ్, సయ్యద్ జిలాని తదితర నేతలు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూల మాలవేసి నివాళులర్పించారు.

సైకిల్ ఎక్కిన ఎంపీ లావు.. మక్కెన, పలువురు నేతలు

పల్నాడు జిల్లాలో వైసీపీ కీలకనేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంతో దాచేపల్లి రా.. కదలిరా సభలో పసుపుకండువా కప్పుకొన్నారు. ఇటీవల ఆయన రాజీనామాచేసిన విషయం తెలిసిందే లావుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పలువురు జడ్పీ టీసీలు, వైసీపీ నేతలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరందరికీ చంద్ర బాబు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు.

పల్నాడు సమస్యలపై లావు ప్రస్తావన

● పనులన్నీ పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంత సమస్యలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రా కదలిరా సభలో చంద్రబాబుకు నివేదించారు. శనివారం దాచేపల్లిలో జరిగిన రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఆయన తాను ఐదేళ్లలో ఎంపీగా పల్నాడు అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. వరికపూడిశెల ప్రాజెక్టుకి నిధులు కేటాయిస్తే ఎనిమిది నెలల్లో లిఫ్టులు పూర్తి చేసి 1.25లక్షల ఎకరాలకు సాగునీరు, 3లక్షల మందికి తాగునీరు ఇవ్వవచ్చన్నారు. అలానే గోదావరి నీటిని తీసుకొచ్చి నకరికల్లు వద్ద సాగర్ కాలువలో కలిపితే 9 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పల్నాడులో తాగునీటి కష్టాలు తీర్చడానికి వాటర్ గ్రిడ్ అవసరమన్నారు. అలానే నియోజకవర్గానికి ఒక 100 పడకల ఆస్పత్రి కావాలని తెలిపారు. లాజిస్టిక్ హబ్ అభివృద్ధి చేస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు స్పందిస్తూ వరికపూడిశెల ప్రాజెక్టు ఏడాది వ్యవధిలోనే పూర్తి చేస్తామన్నారు. బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మించి 75 టీఎంసీల నీటిని నిల్వ చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు అభివృద్ధి చేస్తామని, పల్నాడులో ఉన్న సహజ వనరులను వినియోగించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన వారిని అభినందిస్తున్నా..

వైసీపీలో సీటు ఇస్తానన్నా వద్దని ఆరుగురు ఎంపీలు, 10మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా చేశారని, వారందరిని తాను అభినందిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసే వ్యక్తి వద్ద మంచోళ్లకు స్థానం ఉండదన్నారు. జగన్ తానే ఒక పెద్ద సైకో అని, అలానే ఊరూరికి పిల్ల సైకోలను తయారు చేశాడన్నారు.

5న బీసీ డిక్లరేషన్

ఈ నెల 5న బీసీ డిక్లరేషన్‌ని ప్రకటించబోతోన్నట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఐదేళ్లలో బీసీలకు చేయబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆ డిక్లరేషన్‌లో ప్రకటిస్తామన్నారు. అలానే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా మేలుచేసే కార్యక్రమాలు చేపడతామని చంద్రబాబు తెలిపారు.

వైసీపీ పాలనలో యువతకు మొండిచేయి

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 2: ఒక క్రిమినల్‌ను ముఖ్యమంత్రిగా చేస్తే ఏం జరుగుతుందో వైఎస్ జగన్ చేసి చూపించాడని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అధికంగా నష్టపోయింది యువతేనన్నారు. ఈ ఐదేళ్లలో వారి కోసం ప్రభుత్వం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఒక్కో జిల్లాను ఒక రాజధానిగా అభివృద్ధి చేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ యువత జీవితాలను నాశనం చేశారని ఆయన విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 7.5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తే నేడు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక నిరుద్యోగం గల రాష్ట్రంగా తయారు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. రూ.70వేల కోట్లతో అదానీ డేటా సెంటర్‌ను రాష్ట్రానికి చంద్రబాబు తీసుకు వచ్చారన్నారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారన్నారు. కాని జగన్ మాఫియాకు భయపడి వారు అంతా వెనక్కి వెళ్ళి పోయారన్నారు. లక్షలాదిమంది యువత జీవితాలను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులు అంటే నిరుద్యోగ రాజధాని, డ్రగ్స్ రాజధాని, క్రైం రాజధానిగా తయారు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. టీడీపీ ప్రభుత్వ రూ.16.40 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే వైసీపీ ప్రభుత్వంలో పది లక్షల మందికే ఇచ్చారన్నారు. 6.85 లక్షల మందికి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ భృతిని ఇస్తే అప్పటి ప్రభుత్వం నిరుద్యోగ భృతి లేకుండా చేసిందన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్‌కు భరోసా తెలుగుదేశంతోనే అన్నారు. టీడీపీ, జనసేన కూటమిని ప్రజలు ఆదరించాలన్నారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసి వినూత్నరీతిలో చేసిన ప్రచారం పట్టణ ప్రజలను, పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆకట్టుకుంది.

టీడీపీతోనే ప్రతి ఒక్కరి సంక్షేమం: ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, మార్చి2: తెలుగుదేశం పార్టీతోనే ప్రతి ఒక్కరి సంక్షేమం సాధ్యమవుతుందన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన అంబాల కుటుంబ సభ్యులు శనివారం చింతలపూడిలో నరేంద్ర కుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ ప్రయాణం తెలుగుదేశం పార్టీతోనే కొనసాగిస్తామన్నారు. నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమం కుంటు పడిందన్నారు. జగన్‌రెడ్డి అరాచకాలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజానీకం వైసీపీని సాగనంపటానికి సిద్ధపడిందన్నారు. ఒక్క నియోజకవర్గంలో పనికిరాని ఎమ్మెల్యే మరో నియోజకవర్గంలో ఎలా పనికివస్తాడన్ని ప్రశ్నించారు. పొన్నూరు నుంచి ఒక్క దొంగ వెళ్తే మరో గజదొంగ వచ్చాడన్ని ఎద్దేవా చేశారు. ప్రజలు కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ వైసీపీ దొంగల మాయలో పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబాల చిన్న వెంకట రామయ్య, శివరామ కృష్ణ, దుర్గా ప్రసాద్, అంజనయ్య, లంకేశ్వరరావు, భాగ్యరాజు, పిచ్చయ్య, నాగార్జున, నవీన్ కుమార్, రామకోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్ర కుమార్‌కు మద్దతు తెలుపుతున్న మామిళ్లపల్లి వాసులు

యాజమాన్య హక్కు చట్టం అనర్ధదాయకం

● రద్దు చేసే వరకు పోరాడుతాం ● న్యాయవాద సంఘాల తీర్మానం

గుంటూరు(లీగల్), మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన యాజమాన్య హక్కు చట్టం వల్ల అనేక అనర్ధాలు చోటు చేసుకుంటాయని రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని న్యాయవాద సంఘాలు తీర్మానించాయి. భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల కలిగే దుష్పరిణామాలపై గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ అధ్యక్షతన రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో శనివారం గుంటూరులో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ బార్ అసోసియేషన్ల నుంచి ప్రతినిధులు హాజరై ఈ చట్టం వలన కలిగే దుష్పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. యాజమాన్య హక్కు అనేది రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కు అని వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం ద్వారా ప్రజల నుంచి ఆ హక్కును లాక్కోవాలని చూడటం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. ఈ చట్టం ద్వారా బలవంతులకే ఆస్తి చెందుతుందని, సామాన్యులు ఆస్తులను కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి వివాదాలను పరిష్కరించేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న సివిల్ కోర్టు విచారణ పరిధిని ఈ చట్టం ద్వారా తీసివేయటం శోచనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ చట్టం రద్దు కోసం ప్రజల ద్వారా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని సమావేశంలో తీర్మానించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత కొత్త ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు తిరిగి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించారు. సమావేశంలో వివిధ బార్ అసోసియేషన్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శులుతో పాటు వందల సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు.



ప్రసంగిస్తున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్

ప్రేమ పేరుతో వంచన?

- ఆపై పెళ్లికి అడ్డుగా ఉన్నావంటూ యువకుడి బెదిరింపు
- మనస్థాపంతో యువతి ఆత్మహత్య
- పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం ఆందోళన
- పోలీసుల అదుపులో నిందితుడు

పెదకాకాని, మార్చి 2: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి... కొన్నాళ్ళు సహజీవనం చేసిన తర్వాత 'నేను మరో పెళ్లి చేసుకుంటా, నువ్వు నాకొద్దు' అని మరో యువతితో పెళ్లికి యువకుడు సిద్ధం కాగా, అడ్డు తొలగించుకునేందుకు ప్రేమించిన యువతిని ఆ యువకుడు బెదిరించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. అదే గ్రామానికి చెందిన పారుదల పూర్ణచంద్రరావు అనే యువకుడితో ఆమెకి పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారింది. పూర్ణచంద్రరావు ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో కొన్నాళ్ల వారు సహజీవనం కూడా చేశారు. అయితే పూర్ణచంద్రరావు మరో యువతితో పెళ్లికి సిద్ధంకాగా ప్రేమించిన యువతి అతనిని నిలదీసింది. ఈ విషయం పెద్దల మధ్య పంచాయితీ కాగా రాజీ కుదుర్చు కొని ఎవరిదారిన వారు ఉంటున్నారు. దీంతో ఆ యువతి పెదకాకాని మండలంలోని తన బంధువుల వద్ద ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం పూర్ణచంద్రరావు ఆ యువ తి వద్దకు వచ్చి 'నువ్వు నా పెళ్ళికి అడ్డుగా ఉన్నావు.. నువ్వు చస్తావా.. లేక నన్ను చంపమంటావా?' అంటూ బెదిరించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువతి శుక్రవారం రాత్రి ఆమె ఉంటున్న ఇంటి వంటగదిలో ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేసిన పెదకాకాని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి, బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు.

కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు రూ.30 లక్షల మంజూరు

● నేటి నుంచి మూలవిరాట్‌కు అభిషేకాలు నిలుపుదల

నరసరావుపేట, మార్చి 2: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.30లక్షల నిధులు మంజూరుచేసిందని ఈవో జీ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆదివారం నుంచి 9వ తేదీ వరకు శ్రీత్రికోటేశ్వరుని మూలవిరాట్‌కు అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్లు ఈవో తెలిపారు. అభిషేకమండపంలో స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్పును భక్తులు గమనించాలని కోరారు. తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల్లేవ్.. శీర్షికతలో ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడిని విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే కోనకు ధనార్జనే ధ్యేయం

● వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌బాబు ● వైసీపీకి రాజీనామా...



బాపట్ల, మార్చి 2: పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలను పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పని చేస్తున్నారని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముప్పిరి రాజశేఖర్‌బాబు ఆరోపించారు. ఈ విషయమై శనివారం ఆయన మాట్లాడుతూ దళితులను కించపర్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. దళితులుగా ప్రశ్నించకుండా నోరునొక్కటం కోనకే చెల్లిందన్నారు. వైసీపీ ముసుగులో ఉంటూ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను తొలిగించిన ఘనుడు కోన అన్నారు. జగన్ చేతులమీదగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించిన వైఎస్ విగ్రహాన్ని తొలిగించారని తిరిగి అదే ప్రాంతంలో పెట్టమని అడిగితే తనను వైసీపీ ద్రోహి అనటం హాస్యాస్పదమన్నారు. బాపట్ల ప్రజలు ఇసుక దోపిడి గురించి చేసే ఆరోపణలకు ఎమ్మెల్యే కోన సమాధానం చెప్పాలన్నారు. పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా ఆయన కుటిల బుద్ధిని బయట పెడుతున్నారన్నారు. ఆయన అవినీతి, అక్రమాలు గురించి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుడి వికృత చేష్టలు

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

పొన్నూరుటౌన్, మార్చి 2: ఓ ఉపాధ్యాయుడు మైనర్ బాలికల పట్ల వికృత చేష్టలకు పాల్పడిన ఘటన శనివారం పొన్నూరు పట్టణంలో చోటు చేసుకుంది. పిల్లలు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో ఉపాధ్యాయుడి వికృత రూపం బాహ్య ప్రపంచానికి తెలిసింది. పట్టణంలోని 25వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అహ్మద్ అనే ఉపాధ్యాయుడు తమను వేధించాడని చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని నిలదీసి ఎంఈవోకు సమాచారం అందించారు. రోజూ పాఠశాల తరగతి గదిలోనే బాలికలపై అసభ్య చర్యలకు పాల్పడుతున్నట్లు అహ్మద్‌పై బాలికలు, వారి తల్లిదండ్రులు ఎంఈవో ఆర్ శోభచంద్‌కు, అర్బన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే బాలికల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అహ్మద్‌ను దాష్టీకాలపై నిలదీసిన సమయంలో అహ్మద్ కుటుంబ సభ్యులు కూడా వచ్చి పాఠశాలలోనే బెదిరింపులకు పాల్పడ్డారు. నెల రోజుల క్రితం అహ్మద్ ఇంటి వద్ద ఓ దివ్యాంగురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు ఎంఈవో ఆర్.శోభచంద్ తెలిపారు.

ముప్పాళ్ళలో ఇరువర్గాల ఘర్షణ

● పలువురికి గాయాలు

ముప్పాళ్ళ మార్చి 2: ముప్పాళ్ళలో ఒక టీపాయింట్ వద్ద జరిగిన గొడ వ చిన్న గొడవ ఇరువర్గా ల మధ్య ఘర్షణగా మారి రెండుపార్టీల మధ్య వివా దంగా మారింది. వివరాల లోకి వెళితే ముప్పాళ్ళ ఏటీఎం వద్ద ఉన్న టీపా యింట్ నిర్వాహకులు శనివారం సాయంత్రం నీల్లుచల్లి శుభ్రం చేసు కుంటుండగా తనపై కా వాలని చల్లారనే విషయంపై ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. అది దాడికి దారి తీయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలవారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యా దు చేసేందుకు వెళ్ళగా స్టేషన్ ముందు కూడా గొడవ జరిగింది. కేవలం అధికార పార్టీ వాళ్ల మాత్రమే స్టేషన్‌లోకి తీసుకెళ్ళారని, గర్భిణిగా ఉన్న తన భార్యకు గాయా లయ్యాయని, తమ ఫిర్యాదు పోలీసులు తీసుకోలేదని, తన మూడేళ్ళ కొడుకు తలకు కూడా గాయమైందని బాషా, అతని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్ఐ హాజరతయ్యను వివరణ కోరగా ఎవరి ఫిర్యాదును తీసుకోలేదని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం జరిగిన 'రా.. కదలి రా!' బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

నేడు ముస్లింల ఆత్మీయ సమావేశం

● విజయవంతం చేయాలని కోరిన మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గ ముస్లింల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం మేడికొండూరు మండలం మంగళగిరిపాడు (తురకపాలెం)లో జరుగనుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈనెల 5న జరిగే జయహో బీసీ ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు బీసీ డిక్లరేషన్ ప్రకటించనున్నారని చెప్పారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వివేక హత్య కేసుపై ఆయన కుమార్తె సునీత సంచలన విషయాలు బయటపెట్టడంతో సీఎం జగన్‌రెడ్డి ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో శివరామయ్య, కొనకళ్ల సత్యనారాయణ, వేములకొండ శ్రీనివాస్, అబ్దుల్ గని, కసుకుర్తి హనుమంతరావు, రామరాజు, సుభాని, తౌఫిక్, బాబు, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరవు

● టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న డేగల

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు రక్షణ కరవైందని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ నగర కార్యాలయంలో శనివారం ఆయన బీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టీడీపీ 'జయహో బీసీ' కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జగన్‌పాలనలో బీసీలకు ఎటువంటి ప్రయోజనం జరగకపోగా నష్టం జరిగిందన్నారు. బీసీలపై కక్ష కట్టినట్లు వ్యవహరించారని, టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన అన్ని రకాల పథకాలను రద్దుచేశారు. రాష్ట్రంలోని 125 బీసీ కులాలకు ఆర్థిక సాయం చేసింది టీడీపీనే అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని బీసీలను కోరారు. కార్యక్రమంలో బెల్లా వెంకటరమణ, ఆరాధ్యులు వెంకట రమణ, మరసు మురళి, వంగర ఏడుకొండలు, క్రోసూరి సతీష్, కొండెపు శేఖర్, వెంపటి విజయలక్ష్మి, బీరం వెంకటేశ్వర్లు, బీరం శ్రీనివాసరావు, నల్లమేకల శ్రీను, నడికోటి రమణ తదితరులు పాల్గొన్నారు.

సునీత వ్యాఖ్యలకు వైసీపీ నేతలు సిగ్గుపడాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు



గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు వైసీపీ నేతలు సిగ్గుతో తలదించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సునీత ప్రశ్నలకు సమాధానం చెప్పలేని సకలశాఖామంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి చంద్రబాబుపై విమర్శలు చేయటం సిగ్గుచేటన్నారు. జగన్, సజ్జల, సాయిరెడ్డి లాంటి కరుడు గట్టిన హత్య, ఆర్థిక నేరస్తులు రాజకీయాలలో ఉండటం దేశానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు. జగనాసుర రక్త చరిత్ర గురించి సునీత కళ్ళకు కట్టినట్లు దేశ ప్రజలకు వివరిస్తే, సజ్జల ఏ మొఖం పెట్టుకొని పత్రికా సమావేశం ఏర్పాటుచేశారని ప్రజలతోపాటు సొంతపార్టీ నేతలు సైతం ఛీ కొడుతున్నారని అన్నారు. సజ్జలకు దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యేగా పోటీచేయాలని సవాల్ చేశారు. వివేకా హత్యపై సీబీఐ విచారణ కావాలని కోరుతూ కోర్టులో జగన్ వేసిన పిటీషన్‌ను అర్థాంతరంగా ఎందుకు ఉపసంహరించుకున్నాడో సజ్జల వివరణ ఇవ్వాలని అన్నారు. లేని జబ్బుతో తల్లిని ఆసుపత్రిలో చేర్పించి ఐసీయులో దాక్కున్న పిరికిపంద ఎంపీ అవినాష్‌రెడ్డని అన్నారు. సంచలనాత్మక హత్య కేసులో కీలక ముద్దాయిని అరెస్టు చేయలేక చేతులెత్తేసిన దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థ సీబీఐనిచూసి ప్రజలు జాలిపడ్డారని ఎద్దేవాచేశారు. రాబోయే ఘోర పరాజయాన్ని సర్వేల ద్వారా తెలుసుకుంటున్న సజ్జలకు పూర్తి స్థాయిలో మతి భ్రమించిందని కనపర్తి శ్రీనివాస్ అన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా 'డిజిటల్ థెరపటిక్స్' సేవలు

● ట్విన్ హెల్త్ సంస్థతో 'ధృతి హాస్పిటల్' ఒప్పందం



పత్రాలు మార్చుకుంటున్న నంబియార్, హరికృష్ణ

గుంటూరు(మెడికల్)మార్చి 2: రాష్ట్రంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ఆధారిత 'డిజిటల్ థెరపటిక్స్' వైద్యసేవలను గుంటూరులో ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ రేపూరి హరికృష్ణ వెల్లడించారు. శనివారం కొత్తపేటలోని ధృతి హాస్పిటల్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధుమేహం, అధిక రక్తపోటు, ఒబేసిటీ, థైరాయిడ్, పీసీవోడీ, హైపర్ లిపిడిమియా, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ వంటి జీవనశైలి వ్యాధుల కట్టడికి ఈ కొత్త వైద్య విధానం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. గ్లూకోజ్ స్థాయిలు, నిద్ర, బరువు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించేలా రోగి శరీరంలపై మూడు సెన్సార్లను అమర్చి, ప్రతి రెండు వారాలకు ఒకసారి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీతో ఆయా డేటాను విశ్లేషిస్తామని తెలిపారు. ఏఐ అందించే సూచనల ఆధారంగా రోగుల శరీరంలో క్రానిక్ మెటాబాలిక్ సిండ్రోమ్ ఇన్‌ఫ్లమేషన్ తగ్గించి, తద్వారా ఆయా వ్యాధులను పూర్తిగా కట్టడి చేస్తామన్నారు. ఆయా వ్యాధుల తీవ్రతను బట్టి మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది పాటు సెన్సార్‌లను కొనసాగిస్తామన్నారు. అనంతరం చెన్నైకు చెందిన ట్విన్‌హెల్త్ సంస్థ ప్రతినిధి మహేష్ నంబియార్, డాక్టర్ హరికృష్ణలు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ముఖ్యం

గుంటూరు(తూర్పు), మార్చి2: కార్మికశాఖలో పనిచేసే అధికారులకు చట్టాలపై పూర్తి అవగాహన ముఖ్యమని కార్మిక జాయింట్ కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. శనివారం అరండల్‌పేటలోని వైన్స్ డీలర్స్ కళ్యాణ మండంపలో కార్మికుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీనివాసకుమార్, విశ్రాంత ఉప కార్మిక శాఖాధికారి ఎస్ఎస్ అఖిల్‌లు హాజరై బాల కార్మిక, నిర్మాణ కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఉపకార్మిక కమిషనర్ ఏ గాయత్రిదేవి, సహాయ కార్మిక కమిషనర్ కేఎం సుభానీలు కార్మిక నష్ట పరిహార చట్టాలను అమలు, ధరఖాస్తు పరిశీలనవిధానం, ఎదురయ్యే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో తెనాలి, నరసరావుపేట సహాయ కార్మిక కమీషనర్లు డీవీ శివప్రసాదు, జీ.ధనలక్ష్మి, కార్మిక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఏ మతోన్మాదులు మార్చలేరు

● 'ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా' సభలో డాక్టర్ కత్తి పద్మారావు

గుంటూరు(తూర్పు), మార్చి2: అంబేద్కర్ భావజాలమే ప్రత్యామ్నాయ సంస్కృతి అని, రాజ్యాంగాన్ని ఏ మతోన్మాదులు మార్చలేరని, ఈ దేశ ఉత్పత్తి శక్తులు అయిన మూలవాసులు దళితులు అని డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. శనివారం స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆయన రచించిన 'ఈ దేశం మాది' పుస్తకాన్ని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లాల్, నీల్ మార్క్స్, అంబేద్కర్ మార్గంలో కలిసి సామ్యవాద సమాజం ఏర్పడుతుందన్నారు. పోరాటమే జీవితం, పోరాటమే జీవితంగా పద్మారావు జీవించారని కొనియాడారు. కత్తి పద్మారావు మాట్లాడుతూ దేశంలోని దళిత బహుజన మైనార్టీ శక్తులు ఈ దేశం, ఈ యుగం మాదేనని ముందుకు సాగాలన్నారు. ఈ సభకు వాగ్గేయ కారుడు మాష్టార్జి, ఆంధ్ర మాల్యాద్రి, తంగిరాల సోనీ, తలకాయల్ అశోక్,శిఖా ఆకాష్, భీమ్‌సెన్ రవి సిద్ధార్థ, పరంజ్యోతి అధ్యక్షత వహించగా, సభలో పొగళ్ళ ప్రకాష్, నాదెండ్ల బ్రహ్మయ్య, పాటిబండ్ల కోటేశ్వరరావు, నల్లపు నీలాంబరం, కొరబండి బాబురావు. గంట ప్రభుదాస్, తలకాయల అశోకుడు. బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకాల ప్రకారం పరిశ్రమల సర్వే

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు సిటీ, మార్చి 2: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా పూర్తి చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె ఎస్ జవహర్ రెడ్డి కి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, రీ సర్వే, వేసవిలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, ఎంఎస్ఎంఈ ల సర్వే తదితర అంశాలపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్.జవహర్ రెడ్డి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి సూచనలను జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కార్యాలయం వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమార్, ఆర్డీవో పెద్ది రోజుతో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1.40,000 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోనే 20,000 వరకు ఉన్నాయన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ఏకీకృతపోర్టల్‌లోకి జిల్లాలోని ఎంఎస్ఎంఈ పరిశ్రమల వివరాలు నమోదుకు నిర్వహిస్తున్న సర్వేపై సచివాలయ ఎమినిటీస్, ఇంజనీరింగ్ సెక్రటరీలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పరిశ్రమల శాఖతో పాటు, టెక్స్‌టైల్, నైపుణ్యాభివృద్ధి తదితర శాఖలను భాగస్వామ్యంచేస్తూ సర్వేను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వే జరుగుతన్న తీరును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు మదన మోమన్‌శెట్టి, డిప్యూటీ డైరక్టర్ సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపీకృష్ణ, సీపీవో శేషశ్రీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీఐపీఎం రత్నమన్మోహన్ పాల్గొన్నారు.

సెక్ట్రోలర్ అధికారుల పాత్రే కీలకం

● నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి.

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 2 : ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర అని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సెక్టోరల్ అధికారుల ఎన్నికల సజావుగా జరగడానికి భాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తిచేకూరి తెలిపారు. సాదారణ ఎన్నికల విధులపై సెక్టోరల్, రూట్ అధికారులకు అదనపు కమిషనర్ పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మీతో కలిసి శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 22 మంది సెక్టోరల్, 22 మంది రూట్ అధికారులకు విధులు కేటాయించామన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందని, సెక్టోరల్ అధికారులు ముందుగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గాదర్శకాలతో కూడిన హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని వారికి సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చిన అనంతరం జీఎంసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన చెక్ లిస్టు మేరకు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాపై పోలింగ్ కేంద్రాల్లో ఏ సమస్య ఉన్నా వెంటనే తమదృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో నిరంజన్, ఏఈఆర్వో ప్రదీప్‌కుమార్, మేనేజర్ శివన్నారాయణ, ఎన్నికల విభాగ సూపరిండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



'బాబుతో నేను' వాట్సాప్ గ్రూపు గురించి వివరిస్తున్న నసీర్

'బాబుతో నేను' వాట్స్ యాప్ గ్రూపు ప్రారంభం

గుంటూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): 'బాబుతో నేను' వాట్సాప్ గ్రూపులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ కోరారు. స్థానిక వెంగయ్య నగర్‌లో టీడీపీ నేతలు, మహిళలతో శనివారం ఆయన సమావేశమయ్యారు. నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో నూతనంగా ప్రారంభించిన 'బాబుతో నేను' వాట్సాప్ గ్రూపులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్య నేరుగా చంద్రబాబుకు చేరేలా ఈ డిజిటల్ గ్రూప్‌ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్క ఓటరును చైతన్య పరిచి గ్రూపులో చేరేలా చేయాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో భారతి, శంకర్, ప్రభాకర్, వెంకట్రావు, నవీన్, ఆనంద్, పొదిలి రమేష్, నాగేశ్వర రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు (మెడికల్) మార్చి 2: గోరంట్ల సమీపంలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో గల భాష్యం రామసేతు వెనుక గల కేరళలోని కొట్టక్కల్ ఆర్య వైద్యశాల అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. పంచకర్మ అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు నాడీ పరీక్షించి కీళ్ల నొప్పులు, డిస్క్ ప్రోలాప్స్, సయాటికా, స్పాండిలైటిస్, చర్మవ్యాధులు, లైంగిక సమస్యలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అతి మద్యపానం అలవాటు మాన్పించేందుకు ఆయుర్వేద మందులు అందజేస్తామని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మార్చి 2: విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆటో నగర్ ఫేజ్ 3,4 ఫీడర్స్ పరిధిలోని విశ్వనాధ్ హోటల్, ఎస్‌బీఐ బ్యాంకు రోడ్డు, హెచ్‌పీ పెట్రోల్‌బంకు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పీహెచ్ ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

'మే' లో అవగాహన సదస్సు

●ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్ బాలకృష్ణ

గుంటూరు(తూర్పు), మార్చి2: రిటర్న్స్ ధాఖలు చేయడం, సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడే సమస్యలపై ఆదాయ పన్నుశాఖ ఆధ్వర్యంలో మే నెలలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ చీఫ్ కమిషనర్ బీ. బాలకృష్ణ అన్నారు. శనివారం నగరంపాలెంలో ఆదాయపన్ను శాఖ కార్యాలయంలో ఆడిటర్లు, జిల్లా అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సొసైటీ,ట్రస్ట్‌ల రిజిస్ట్రేషన్ సమయంలో ఏర్పడే ఇబ్బం దులు గురించి అలాగే రిటర్న్స్ ధాఖలు చేసే సమయంలో సాఫ్ట్‌వేర్‌లో ఉండే ఇబ్బందులను వీ.బాలకృష్ణ దృష్టికి అడిటర్లు తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇతర సమస్యలను పరిష్కరిస్తామని, అలాగే అవగాహన సదస్సు నిర్వహించి అనుమానా లను నివృత్తి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏపీ ఆడిటర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్మికుల సమస్యలపై

మండల స్థాయి పోరాటం

గుంటూరు(తూర్పు), మార్చి2: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంకోసం మండల స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు డీవీ.నరసింహా రావు పిలుపునిచ్చారు. శనివారం పాతగుంటూరు సీఐటీయూ కార్యాలయంలో ఎం. నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అనేక గ్రామ పంచాయతీలలో కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించ లేదని, ఇలా అయితే వారి కుటుంబం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. సమావేశంలో యూనియన్ నేతలు రామారావు, కే.సుబ్బారావు, పి. మీనకరావు, కే.శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు మరో పోరుకు సిద్ధం కావాలి

గుంటూరు(తూర్పు), మార్చి2: అంగన్‌వాడీల సమ్మెకాలపు ఒప్పంద జీవోలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని, ఇదే కొనసాగితే అంగన్‌వాడీలు మరోపోరుకు సిద్ధమవుతారని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బారావమ్మ హెచ్చరించారు. శనివారం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 42 రోజుల సమ్మె ఫలితంగా మినిట్స్ కాపీ విడుదల చేసినా జీవోలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీ.దీప్తిమనోజ, అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి, రాధా, హేమలత, రత్నమంజుల తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ టీవీనారాయణ తదితరులు

ఫార్మసీ రంగంలో మహిళల పాత్ర కీలకం

● ఇండియన్ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ

● ఘనంగా ముగిసిన ఫార్మా ఉమెన్స్ లీగ్ పోటీలు

గుంటూరు(విద్య),మార్చి 2: ఫార్మా రంగంలో మహిళలపాత్ర ఎంతో కీలకమని ఇండియన్ ఫార్మసీకౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ తెలిపారు. చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మా స్యూటికల్ సైన్సెస్‌లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ లీగ్ ఫైనల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో మహిళలు భాగస్వామ్యం కావాలన్నారు. పరిశోధనలు, బోధనారంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఇండియా(ఏపీటీఐ) జాతీయ అధ్యక్షులు డాక్టర్ మిలింద్ జే.ఉమేకర్ మాట్లాడుతూ మహిళలు ఫార్మసీ రంగంలో రాణించడం హర్షణీయమని, వారిలో మరింత ఉత్సాహాన్ని నింపడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, చిఫ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర, డాక్టర్ కే.వెంకటరమణ, డాక్టర్ అంకమ్మచౌదరి, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ నరేంద్ర, ఏపీటీఐ ఫోరం కన్వీనర్ డాక్టర్ కే. పద్మలత తదితరుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా 73 ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ బ్రోచర్ ఆవిష్కరించారు.

రూ. 22 కోట్లతో ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు

● శరవేగంగా అభివృద్ధి చేస్తాం

● మంత్రి రజనీ, మేయర్ కావటి విస్తృత పర్యటన



పనులపై చర్చిస్తున్న మంత్రి రజనీ, మేయర్ మనోహర్ తదితరులు

గుంటూరు, మార్చి 2: విస్తరణ దశలో ఉన్న ఏటీ అగ్రహారం ప్రధాన రహదారిని రూ.22 కోట్లతో శరవేగంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజనీ తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు, జీఎంసీ అధికారులతో కలిసి మంత్రి శనివారం ఏటీ అగ్రహారం మెయిన్‌రోడ్డులో పర్యటించారు. అక్కడ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం బడ్జెట్ రూ.22 కోట్లు కాగా డ్రెయిన్‌ల నిర్మాణాలకు రూ.4 కోట్లు, తాగునీటి పైపులైన్‌ల కోసం మరో రూ.1.7 కోట్లు, రూ. 6 కోట్లతో రహదారినిర్మాణం, సెంట్రల్ లైటింగ్‌కు రూ.68 లక్షలు, జీఎస్‌బీ రోడ్ల కోసం రూ.కోటితో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు ఒక ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. దశాబ్దాలుగా నిర్మాణాలకు నోచుకోని ఎన్నో రహదారులను పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కులు పంపిణీ చేస్తున్న జస్టిస్ వెంకటశేషసాయి

సమష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం

● హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి

గుంటూరు(విద్య),మార్చి 2: యువత సమష్టిగా కృషిచేస్తే ఎటువంటి సమస్యలకైనా పరిష్కారం లభిస్తుందని హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి తెలిపారు. శనివారం చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్సెస్‌లో నిర్వహించిన 13వ వార్షికోత్సవ కార్యక్రమానికి జస్టిస్ వెంకటశేషసాయి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ యువతలో ప్రధానంగా ఆత్మవిశ్వాసం, ఇతరులను గౌరవించే తత్వం ఉండాలన్నారు. టెక్‌మహీంద్ర రిక్రూటింగ్ మేనేజర్ వీరంరెడ్డి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిజెన్స్ సాంకేతిక నైపుణ్యాలను యువత మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కళ్ళం మోహనరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌జీ రెడ్డి,, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, ఏవో కళ్ళం నవ్య పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జీఎంసీ వార్షిక బడ్జెట్ రూ.1497.14 కోట్లు

● స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించిన మేయర్

గుంటూరు(కార్పొరేషన్),ఫిబ్రవరి2: 2024-25 సంవత్సరానికి రూ.1497.14 కోట్ల అంచనాలతో సిద్ధం చేసిన నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను శనివారం నగరమేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అధ్యక్షతన ఏర్పడిన స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. నగర కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి నగరపాలక సంస్థ విభాగాదిపతులు, ఆడిట్ అధికారులతో 2023-24 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి రివైజ్డ్ బడ్జెట్ 2024-25 అంచనా బడ్జెట్‌పై మేయర్ చాంబర్‌లో శనివారం స్టాండింగ్ కమిటి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.634.56 కోట్ల ప్రారంభ నిల్వతో పాటు వార్షిక ఆదాయం రూ.612.62 కోట్లతో కలిసి రూ.1247.19 కోట్లతో కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. అందులో 578.62 కోట్లు ఖర్చులు పోగా, అంత్య నిల్వ రూ.669.56 కోట్లు ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రారంభనిల్వ రూ.669.56 కోట్లు ఉండగా, జీఎంసీ ఆదాయం రూ.828.57కోట్లు అంచనాతో కలిపి రూ.1497.14 కోట్లతో జీఎంసీ బడ్జెట్‌ని స్టాండింగ్ కమిటి ఆమోదించిందని తెలిపారు. రూ.923.47 కోట్లు ఖర్చులు పోగా అంత్య నిల్వ 573.66 కోట్లు ఉంటుందని తెలిపారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ ను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మీ, విభాగాధిపతులు, స్టాండింగ్ కమిటి సభ్యులు షేక్ మహమూద్, సంకురి శ్రీనివాసరావు, కంద్రగుంట గురవయ్య, శ్యామల వెంకట రమణాదేవి, మల్లిబోయిన శ్రీవల్లి, పాపతోటి అంబేద్కర్ పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ

నేటి పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

● డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ వెల్లడి ● నగరంలో అవగాహన ర్యాలీ

గుంటూరు (మెడికల్) మార్చి 2: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తన ఛాంబర్‌లో డీఎంహెచ్‌వో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 950 కేంద్రాల్లో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు పోలియో చుక్కల కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లల్లోపు వయస్సు కలిగిన చిన్నారులు జిల్లాలో 2,09,219 మంది ఉండగా, వీరందరికీ ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయాలని ఆమె కోరారు. అలాగే 72 సంచార పల్స్ పోలియో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ విజయలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో డీఐవో కేవీ సుబ్బరాజు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ శ్రావణ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి శనివారం స్థానిక కేవీపీ కాలనీ, శ్రీనివాసరావుతోట ప్రాంతాల్లోని యూసీహెచ్‌ల్లో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాలను పరిశీలించారు.

అవగాహనతో ఎన్నికల విధులు సులభతరం

● కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు(తూర్పు), మార్చి2: ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు వారి విధులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై పూర్తి అవగాహన ఉంటే ఎన్నికల విధుల నిర్వహణ సులభంగా ఉంటుందని కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కలక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా ఐటీ సెల్, డిస్ట్రిక్ట్ ఎక్స్‌పెండీచర్ మానిటరింగ్ కమిటీలతో 1950 కాల్ సెంటర్, కంప్లైంట్ సెల్, కంట్రోల్‌రూమ్‌లలో విధులు కేటాయించిన నోడల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియా, ఈ పేపర్లు అండ్ కేబుల్ నెట్‌వర్క్‌తో సహా టీవీ, రేడియో ఛానెల్‌లు, ఆడియో, వీడియో డిస్‌ప్లేలు, సినిమా హాళ్లు ఇంటర్నెట్ ఆధారిత మీడియా వెబ్‌సైట్‌ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల కోసం మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ పర్యవేక్షణ చేయాలన్నారు. సామాజిక మాధ్యమాలను ఎలా వినియో గించాలో ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేస్తుందని, ఎన్నికలలో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్ని కల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. సమావే శంలో డీఆర్వో పెద్ది రోజా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే.స్వాతి, ఆర్డీవో శ్రీఖర్, ఎంసీ కమిటీ సభ్యులు ఆర్. రమేష్ చంద్ర, ఎంపీ రవిశంకర్, ఎం.సాంబశివ రావు, అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

గుంటూరు(తూర్పు), మార్చి2: కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ హాలులో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలలో నియమించిన అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి జేసీ రాజకుమారి సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలైన ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్టీ), స్టాటికల్ సర్వే టీం (ఎస్ఎస్టీ)లు పకడ్బందీగా అమలుపై శిక్షణ ఇచ్చారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించారు.

నగరంలో మైక్రో, స్మాల్ సర్వేకు సహకరించాలి

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 2 : నగరంలో మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంట్రప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) సర్వేకు సహకరించాలని నగర కమిషనర్ కీర్తిచేకూరి కోరారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి ఎంఎస్ఎంఈ సర్వే పోస్టర్‌ని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ స్కీం ద్వారా ఎంఎస్ఎంఈ ఏకీకృత పోర్టల్ ప్రారంభించిందని, ర్యాంప్ లోని ఒక అంశమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్ లో భాగంగా పరిశ్రమల శాఖ ఈ నెల 1 నుండి 20 వరకు సర్వే నిర్వహిస్తుందని తెలిపారు.

ముంబై పారిశ్రామికవేత్తతో వరలక్ష్మి శరత్‌కుమార్ నిశ్చితార్థం



ప్రముఖ సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ముంబైకు చెందిన పారిశ్రామికవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్ళి చేసుకోనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం శుక్రవారం ముంబై నగరంలో ఇరు కుటుంబాల సమక్షంలో జరిగింది. వివాహం ఈ ఏడాదిలోపు జరుగనుందని, త్వరలోనే వివాహ తేదీని వెల్లడిస్తామని వరలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, వీరిద్దరూ 14 ఏళ్ళుగా స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఎట్టకేలకు త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. ఈ నిశ్చితార్థంలో సినీ నటుడు శరత్ కుమార్, ఆయన సతీమణి రాధిక శరత్ కుమార్‌తో పాటు వరుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, వరలక్ష్మి శరత్ కుమార్ ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో మంచి గుర్తింపుతో పాటు వరుస అవకాశాలు దక్కించుకుంటూ సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

విదేశాల్లోనూ హను-మాన్‌ను విడుదల చేస్తున్నాం



యువ కథానాయకుడు తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ '50 రోజుల పండగ చూసి చాలా రోజులైంది. అది మా సినిమాకు జరగడం ఆనందంగా ఉంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోయే చిత్రాలకు ఈ చిత్ర విజయం పునాది వేసింది. విదేశాల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం. 'జై హనుమాన్' వర్క్ మొదలైంది. 'హను-మాన్'లో చివరి ఐదు నిముషాలు ఎలా అందరికీ నచ్చాయో 'జై హనుమాన్' కూడా అలాగే ఉండబోతోంది' అన్నారు. ప్రేక్షకుల వల్లే ఇంత అద్భుత విజయం సాధ్యమైందని హీరో తేజ చెప్పారు. 150 థియేటర్లలో 50 రోజులు ఆడడం సాధారణ విషయం కాదని, అందరూ అంకిత భావంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని నిర్మాత నిరంజన్‌రెడ్డి చెప్పారు.

మేం ఆశించిన హిట్ వచ్చింది



'సినిమా మొదలు పెట్టినప్పుడు బాగా వస్తే చాలు అనుకున్నాం. తర్వాత ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులకు రీచ్ అయితే అదే పదివేలు అనుకున్నాం. అన్నింటికి మించి ఒక మంచి హిట్ కొడితే బావుంటుందనే కోరిక మనసులో ఉండేది. అది ఇప్పుడు తీరినందుకు ఆనందంగా ఉంది' అన్నారు శివ కందుకూరి. ఆయన హీరోగా నటించిన 'భూతద్దం భాస్కర్ నారాయణ' శుక్రవారం విడుదలై విజయం సాధించడంతో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. సినిమా చూసి ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని శివ చెప్పారు. తాము ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందని హీరోయిన్ రాశీ సింగ్ తెలిపారు. నిర్మాతలు స్నేహాల్ శశిధర్ మాట్లాడుతూ 'ప్రతి షోకీ ఆదరణ పెరుగుతోంది. ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని చెప్పారు

మైనస్ 30 డిగ్రీల్లో షూటింగ్ చేశాం

విశ్వక్ సేన్



'ఈ సినిమా షూటింగ్ ప్రతి రోజూ సవాలే. మైనస్ 30 డిగ్రీల్లో వర్క్ చేశాం. కాళ్లు చేతులు గడ్డ కట్టేవి. ఇప్పుడు అది తలుచుకుంటే ఇంత రిస్క్ చేశామా అనిపిస్తుంది. ఇప్పుడు చేయమంటే మాత్రం చేయను' అన్నారు హీరో విశ్వక్ సేన్. ఆయన నటించిన 'గామి' చిత్రం ఈ నెల ఎనిమిదిన విడుదల కానుంది.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ' లుక్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. అఘోరా పాత్ర కోసం దర్శకుడు విద్యాధర్ ఎంతో రిసెర్చ్ చేశారు. మూడేళ్ల ముందుగానే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశారు. కుంభమేళాలో కొన్ని లక్షల మంది అఘోరాలు ఉంటారు. నేనూ వాళ్లతో కలసిపోయేవాడిని. నా స్టయిల్‌లో ఎక్స్‌ప్లోర్ చేసుకుంటూ వెళ్లా' అని ఆయన చెప్పారు.

దర్శకుడు విద్యాధర్ తను నటించిన 'వెళ్లిపోమాకే' సినిమా చూసి తన దగ్గరకు వచ్చాడని చెబుతూ 'ఈ కథను సినిమాగా మలచడానికి ఐదేళ్ల పడుతుందని నాకు ముందే తెలుసు. ఒక వేళ ఏడాదిలో తీయాలనుకుంటే రూ వంద కోట్లు కావాలి. వారణాసి, కుంభమేళలో గొరిల్లా షూటింగ్ చేశాం. అలా బడ్జెట్ కలసి వచ్చింది. సమయమే దీనికి పెట్టుబడి. ఇప్పటివరకూ ఎవరూ తీయని చిత్రమిది' అని విశ్వక్ సేన్ చెప్పారు. ఈ సినిమాకు తను పారితోషికం తీసుకోకుండా పని చేసినట్లు ఆయన చెప్పారు. మొత్తం 70 రోజులు పని చేసినట్లు తెలిపారు. హీరోయిన్ చాందిని కూడా చాలా కష్టపడిందని చెప్పారు. పీసీఎక్స్ ఫార్మెట్‌లో 'గామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నామనీ, తెలుగులో ఈ ఫార్మెట్‌లో వస్తున్న తొలి చిత్రమని ఆయన తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పల్నాడు జిల్లా దాచేపల్లిలో శనివారం జరిగిన రా.. కదలిరా ! బహిరంగ సభలో పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

పల్స్‌పోలియోకి ఆరోగ్య కేంద్రాలు సిద్ధం

● జిల్లా ఉప వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి, మారీసుపేట మార్చి 2: పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సిద్ధం చేసినట్లు జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం పోలియో వ్యాక్సిన్‌లను భద్రపరిచిన రిఫ్రిజరేటర్లను జిల్లా ఉప వైద్యారోగ్యశాఖ అధి కారి డాక్టర్ అన్నపూర్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరముల లోపు పిల్లలు 12,723 మంది ఉన్నారన్నారు. వారందరికీ పోలియో చుక్కలు అందించేందుకు ఆరు రూట్లుగా విభజించి 60 కేంద్రాలను ర్పాటు చేసినట్లు తెలిపారు. మొబైల్ ట్రాన్సిట్ పాయింట్లను కూడా గుర్తించి ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్స్ చింతల ప్రమీల, దాసరి విజయకుమారి తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

పోలియో రహిత సమాజాన్ని సాదిద్ధాం

● మునిసిపల్ చైర్‌పర్సన్ టీ.రాధిక ● పట్టణంలో అవగాహన ర్యాలీ

తెనాలి, మారీసుపేట మార్చి 2: పోలియో రహిత సమాజాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద శనివారం పల్స్ పోలియో అవగాహన ర్యాలీని కమిషనర్ బీ.శేషన్నతో కలసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3వ తేదిన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరముల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేశామని, పురపాలక సిబ్బంది, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో భాగంగా గాంధీచౌక్‌లో మానవహారంగా నిలిచి పోలియోరహిత సమాజాన్ని నిర్మిద్ధామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలను తొలగించండి ..

కాల్వలలో వ్యర్థాలను వేయరాదని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ప్రజలకు సూచించారు. తెనాలి పట్టణంలోని 2వ వార్డు గోలి డొంక రోడ్డులో శనివారం రెండవరోజు జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించి, మునిసిపల్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాళీ స్థలాలోని చెట్లను స్థల యజమానులు తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్, గ్రీనరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వీరనారాయణ

వివేకా హైస్కూల్లో ఫుడ్ ఫెస్టివల్

తెనాలి అర్బన్, మార్చి 2 : స్థానిక చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లోని వివేకా హైస్కూల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు తయారు చేసిన వివిధ రకాల వంటల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రకరకాల ఆహార పదార్థాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులు తెలుసుకునేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యానికి ఏ రకమైన పౌష్టికాహారం అవసరమో, ఏ ఆహారంలో ఏ పోషకాలు ఉంటాయో అవగాహన కలుగుతుందన్నారు. విభిన్న పంటలు, వంటకాలు, ప్రసిద్ధ స్థలాలు, సుప్రసిద్ధ వ్యక్తులు, వివిధ రాష్ట్రాల వేషధారణలతో విద్యార్థులు అద్భుతంగా ఆకట్టుకున్నారు. సీఈవో ఉదయ్‌కిరణ్, డైరెక్టర్ రామరాజు, వెంకటరత్నం, సహనాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నరసింహారావు గౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

నరసింహారావు గౌడ్ సేవలు చిరస్మరణీయం

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 2: బాలాజీ లాడ్జి అధినేత, వైకుంఠపురం దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త తూళ్ళూరు నరసింహారావు గౌడ్ ఈ ప్రాంత ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శనివారం పట్టణంలోని గంగానమ్మపేటలో దివంగత నరసింహారావు 38వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కాంస్యవిగ్రహానికి ఎమ్మెల్యే శివకుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తుళ్ళూరు జగన్మోహన్‌రావు, తుళ్ళూరు శ్రీనివాసరరావు, తుళ్ళూరు మాధవరావు, తుళ్ళూరు వివేకానంద, ఉదయబాస్కరరావు, బాలాజీ, సుబ్బారాయుడు, కందుల సాంబశివరావుగౌడ్, వేణువర్ధన్, గుంటూరు కోటేశ్వరరావు, అక్కిదాసుకిరణ్‌కుమార్, అనుమోలు విజయ్‌కుమార్‌గౌడ్, మరిపూడి నరసింహారావు, అంజిరెడ్డి, గౌడ సంఘీయులు, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని ఏ మతోన్మాదులు మార్చలేరు

● 'ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా' సభలో డాక్టర్ కత్తి పద్మారావు

గుంటూరు(తూర్పు), మార్చి2: అంబేడ్కర్ భావజాలమే ప్రత్యామ్నాయ సంస్కృతి అని, రాజ్యాంగాన్ని ఏ మతోన్మాదులు మార్చలేరని, ఈ దేశ ఉత్పత్తి శక్తులు అయిన మూలవాసులు దళితులు అని డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. శనివారం స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆయన రచించిన 'ఈ దేశం మాది' పుస్తకాన్ని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లాల్, నీల్ మార్క్స్, అంబేడ్కర్ మార్గంలో కలిసి సామ్యవాద సమాజం ఏర్పడుతుందనిన్నారు. పోరాటమే జీవితం, పోరాటమే జీవితంగా పద్మారావు జీవించారని కొనియా డారు. కత్తి పద్మారావు మాట్లాడుతూ దేశంలోని దళిత బహుజన మైనార్టీ శక్తులు ఈ దేశం, ఈ యుగం మాదేనని ముందుకు సాగాలన్నారు. ఈ సభకు వాగ్గేయకారుడు మాష్టార్జి, ఆంధ్ర మాల్యాద్రి, తంగిరాల సోనీ, తలకాయల్ అశోక్,శిఖా ఆకాష్, భీమ్‌సెన్ రవి సిద్ధార్థ, పరంజ్యోతి అధ్యక్షత వహించగా, సభలో పాగళ్ళ ప్రకాష్, నాదెండ్ల బ్రహ్మయ్య, పాటిబండ్ల కోటేశ్వరరావు, నల్లపు నీలాంబరం, కొరబండి బాబురావు. గంట ప్రభుదాస్, తలకాయల అశోకుడు. బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను మేనిఫెస్టోలో చేర్చండి

● జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్లమనోహర్‌కి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతల వినతి



మనోహర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాగేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు

తెనాలి రూరల్, మార్చి 2: అగ్రిగోల్డ్ ఆర్థిక మోసంతో నష్టపోయిన పేద ప్రజలకు న్యాయం జరిగేలా టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలన్న అంశాన్ని చేర్చాలని సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నాగేశ్వరరావు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్లమనోహర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల లోపు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి మడమతిప్పిందన్నారు. గత తొమ్మిదేళ్లుగా లక్షలాదిమంది అగ్రిగోల్డ్ బాధితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో సుమారు 500 మందికి పైగా కస్టమర్లు, ఏజెంట్లు ఈ నష్టాల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు, అసహజ మరణాలకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో రూ.20 వేలు లోపు డిపాజిట్ చేసిన 14 లక్షల మంది బాధితులకు తాము అధికారంలోకి వచ్చిన వారం లోపు డబ్బులు చెల్లిస్తామని, రూ. 20వేలు పైన డిపాజిట్ చేసిన మరో 6 లక్షల మందికి ఆరు మాసాలలో వడ్డీతో సహా చెల్లిస్తానని జగన్ చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయని ఆరోపించారు. ఆ డబ్బులు అందక మనోవేదనతో మరణించిన బాధిత కుటుంబాలనికి రూ. 10లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ఇస్తానని గొప్పగా ప్రకటించిన జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వరకూ ఒక్కరికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడం బాదాకరమన్నారు. బాధితులకు న్యాయం చేయగలిగిన సత్తా ఉన్న టీడీపీ, జనసేన ఉమ్మడికూటమికి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించామన్నారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పసుపు రైతుల రాస్తారోకో

తెనాలిరూరల్, మార్చి 2: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో పసుపు దగ్ధమై 44రోజులు గడుస్తున్నా నష్టపోయిన రైతులకు ఇంతవరకు పరిహారం చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం దుగ్గిరాలలో రాస్తారోకో నిర్వహించనున్నట్లు పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకాశివ సాంబిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు, యాజమాన్యం సమక్షంలో స్టాక్ వివరాలు, రికార్డులు పరిశీలించి నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలాచూడాలని డిమాండ్ చేశారు. ఆదివారం చేపట్టే నిరాహార దీక్ష, రాస్తారోకోలో పరిసర గ్రామాల రైతులు పాల్గొని, బాధిత రైతులకు సంఘీబావం తెలపాలని కోరారు.



గ్రామంలో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ షైనీ తదితరులు

పరి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

● జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ

తెనాలి రూరల్, మార్చి 2: పరిసరాల పరిశుభ్రతలతోనే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షైనీ అన్నారు. శనివారం మండలంలోని చావావారిపాలెం గ్రామంలో జాతీయ సేవాపథకం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రామంలో వ్యర్థాలను తొగించి గ్రామస్థులకు పరిశుభ్రతపై అవగాహక కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి అరుణ సుజాత పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జెవీ సుధీర్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఘట్టమనేని రామకృష్ణ

టీడీపీ, జనసేన విజయానికి కృషిచేయాలి

● టీడీపీ సీనియర్ నేత ఘట్టమనేని రామకృష్ణ

కొల్లిపర, మార్చి 2 : టీడీపీ, జనసేన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఘట్టమనేని రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందున ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు. రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, షేక్ రఫీ, విప్పల రమేష్‌రెడ్డి, కనపాల రవిబాబు, ఆరిమండ వెంకటరెడ్డి, జొన్నల నాగిరెడ్డి, భీమవరపు లంక కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత మండల ఉపాధ్యక్షుడిగా గోపాలకృష్ణ

పెదకాకాని, ఫిబ్రవరి 2 : పెదకాకాని మండలం తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా పెదకాకానికి చెందిన బెజ్జం గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం నియామక ఉత్తర్వులను పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జారీ చేశారు.

కార్మిక చట్టాలపై అవగాహన ముఖ్యం

గుంటూరు(తూర్పు),మార్చి2: కార్మికశాఖ అధికారులకు చట్టాలపై పూర్తి అవగాహన ముఖ్యమని కార్మిక జాయింట్ కమిషనర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. శనివారం అరండల్‌పేటలోని వైన్స్ డీలర్స్ కళ్యాణ మండపంలో కార్మికుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీనివాసకుమార్, విశ్రాంత ఉప కార్మిక శాఖాధికారి ఎస్ఎస్ అఖిల్‌లు హాజరై బాలకార్మిక, నిర్మాణ కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఉపకార్మిక కమిషనర్ ఏ గాయత్రిదేవి, సహాయ కార్మిక కమిషనర్ కేఎం సుభానీలు కార్మిక నష్ట పరిహార చట్టాలను అమలు, ధరఖాస్తు పరిశీలన విధానాలను వివరించారు. కార్యక్రమంలో తెనాలి, నరసరావుపేట సహాయ కార్మికశాఖ కమిషనర్లు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్న క్యాంటీన్లలో ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట మార్చి 2: టీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో శనివారమూ పేదలకు ఆహారం పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకులు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు వెనిగళ్ళ శివప్రసాద్ తెలిపారు. టీడీపీ గుంటూరు జిల్లా పార్లమెంటరీ అభ్యర్థి డాకర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరు, శివాజి చౌక్‌ల వద్దగల అన్నక్యాంటీన్‌లలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, కొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, ముళ్ళపూడి వెంకట్, రమేష్, సాంబయ్య, వెంకటేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులను సకాలంలో చెల్లించండి

తెనాలి, మారీసుపేట మార్చి 02: తెనాలి పురపాలక సంఘ పరిదిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్నులను సకాలంతో చెల్లించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బీ. శేషన్న శనివారం ఒక ప్రకటణలో పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం 2023 -24 వరకు చెల్లించవలసిన పన్ను బకాయిలను ఏక మొత్తంగా లేక దఫాలువారీగా ఈ నెల 31 లోపు పూర్తిగా చెల్లించే వారికి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆస్తి పన్నులను, ఖాళీ స్థల పన్నుల బకాయిల మొత్తాన్ని వెంటనే మునిసిపల్ కార్యాలయ కౌంటర్, సచివాలయం, సీడీఎంఏ ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా గానీ చెల్లించాలని కోరారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాల మహాసభ అధ్యక్షుడు వెంకట్రావు తదితరులు

నేడు బాపట్లలో మాలల సింహగర్జన

పొన్నూరుటౌన్, మార్చి2: బాపట్లలో ఆదివారం జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలన్ని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు కోరారు. శనివారం నిడుబ్రోలులో జరిగిన కార్యక్రమంలో సింహగర్జన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల హక్కులని కాలరాసేందుకే వర్గీకరణ చిచ్చును ఆర్ఎస్ఎస్, బిజేపి రగిల్చాయన్ని ఆరోపించారు. మందకృష్ణ మనువాదుల ఉచ్చులో చికుకున్నారన్నారు. కపట ప్రేమను అర్థం చేసుకోలేక రిజర్వేషన్లకు చేటు తెస్తున్నారన్ని ఆరోపించారు. వీటన్నిటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సింహ గర్జన సభను బాపట్లలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు బడుగు బలహీన వర్గాలు, ఎస్సి, ఎస్టీలు హాజరై విజయవంతం చేయాలిసిందిగా విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో మాల మహాసభ నాయకులు అక్కిదాసు జోసఫ్, యడ్ల వందనం, జంగమయ్య, మిక్కిలి జాన్, రోశయ్య, నరేంద్ర, సుధాకర్ పాల్గొన్నారు.

నేటి పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

గుంటూరు (మెడికల్) మార్చి 2: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం తన ఛాంబర్‌లో డీఎంహెచ్‌వో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 950 కేంద్రాల్లో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు పోలియో చుక్కల కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లల్లోపు వయస్సు కలిగిన చిన్నారులు జిల్లాలో 2,09,219 మంది ఉండగా, వీరందరికీ ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేయాలని ఆమె కోరారు. అలాగే 72 సంచార పల్స్ పోలియో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ విజయలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో డీఐవో కే వీ సుబ్బరాజు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ శ్రావణ్‌బాబు, డీప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకర కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

● బొమ్మిడాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ కృష్ణమూర్తి

● ఘనంగా ఆస్పత్రి 20వ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వల చేసి వేడుకలను ప్రారంభిస్తున్న బొమ్మిడాల భానుమూర్తి, పక్కన రత్నగిరి బాబు, డాక్టర్ సుధాకర్ తదితరులు

పెదకాకాని, మార్చి 2: అందత్వ నివారణలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని బొమ్మిడాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ బొమ్మిడాల కృష్ణమూర్తి తెలిపారు. శనివారం శంకర్ కంటి ఆస్పత్రిలో నిర్వహించిన ఆస్పత్రి 20వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ శంకర్ కంటి ఆస్పత్రి సిబ్బంది ఎంతో అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. త్వరలోనే మరో రూ.10 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. మాదల రత్నగిరి బాబు మాట్లాడుతూ స్వామివారి కోరినట్లుగానే శంకర్ కంటి ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. పేదలకు అందుబాటులో కంటి వైద్యం అందిస్తున్న ఘనత ఈ ఆస్పత్రికి దక్కిందన్నారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆస్పత్రికి సంబంధించి వార్షిక నివేదికను సభలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



పెదకాకాని జనసేన పార్టీ కార్యాలయంలో నరేంద్ర, శ్రావణ్ కుమార్

ఐకమత్యంగా ముందుకు సాగుదాం

● మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందాం

● మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్

పెదకాకాని, మార్చి 2 : ఐకమత్యంగా ముందుకు సాగుదాం, సమష్టిగా పనిచేద్దాం, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన బలపరిచిన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్, టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్‌లు తెలిపారు. శనివారం పెదకాకానిలోని మండల జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు హాజరయ్యారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరేళ్ల వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్, శ్రావణ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. విబేదాలను పక్కనపెట్టి, సోదర భావంతో ముందుకు సాగుదాం అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలలో, ఆ పార్టీల నాయకులలో ఎవరూ ఎక్కువ తక్కువ కాదని, అందరూ సమానమేనని, ఎటువంటి బేషజాలకు వెళ్ళకుండా కలిసికట్టుగా ఎన్నికల అభ్యర్థులు గెలిపించుకుందామని సూచించారు. అనంతరం టీడీపీ జనసేన పార్టీ నాయకులతో కొద్దిసేపు వారు చర్చించారు. కార్యక్రమంలో జనసేన నేతలు వడ్రాణం మార్కండేయ బాబు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మనోహర్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘు సభ్యులు

బ్రాహ్మణుల సంక్షేమం,అభ్యున్నతికి కృషి చేస్తాం

● ఆత్మీయ సమావేశంలో నాదెండ్ల మనోహర్

తెనాలిరూరల్, మార్చి 2: బ్రాహ్మణుల సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించి వారి అభ్యున్నతికి పాటుబడతానని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి నియోజకవర్గ టీడీపీ,జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం పట్టణంలోని రామలింగేశ్వరపేటలో బ్రాహ్మణ సంఘీయులతో నాదెండ్ల మనోహర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ తెనాలిలో మంచి విద్యకు నిలయంగా పేరుగాంచి, ఎందరికో విద్యనందించి గొప్ప స్థితిలోనిలబెట్టిన తాలూకా జూనియర్ కాలేజ్‌ని ఈ ప్రభుత్వం అనేక నిబంధనలతో మూయించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మూతబడిన తాలూకా జూనియర్ కళాశాలకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. తెనాలి ప్రసిద్ధిగాంచిన వైకుంఠపురం దేవస్థానాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. గత సంవత్సరం స్వామి వారికి తెప్పోత్సవం జరపలేదని అందుకు కాలువలో నీరు పారుదల కాకపోవడమే కారణమంటూ ఆలయ నిర్వాహకులు భక్తులకు చెప్పడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్ల నుండి సాంప్రదాయంగా వస్తున్న స్వామి వారి తెప్పోత్సవాన్ని నీరు లేవంటూ చెప్పి నిలుపుదల చేసి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేయడం సమంజసం కాదన్నారు. వైకుంఠపురం ఆలయంలో భక్తుల ఆకాంక్షలకు తగ్గట్టుగా తాను అధికారం చేపట్టిన వెంటనే ఏర్పాట్లను పర్యవేక్షిస్తానని ఆలయ పూజారులకు సైతం తగిన గుర్తింపు తెవపనున్నట్లు చెప్పారు. అదే విధంగా బ్రాహ్మణుల సంక్షేమానికి అవసరమైన కృషి చేస్తానని నాదెండ్ల హామి ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఘన విజయం పొందేలా ఆశీస్సులందించాలని వారిని కోరారు. అనంతరం మనోహర్‌ను బ్రాహ్మణపెద్దలు వేద ఆశీస్సులు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

మార్గదర్శకాల ప్రకారం పరిశ్రమల సర్వే

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్

గుంటూరు సిటీ, మార్చి 2: జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వే ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్ర మంగా పూర్తి చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె ఎస్ జవహర్ రెడ్డి కి తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, రీ సర్వే, వేసవిలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం పనులు, ప్రభుత్వ ప్రాధాన్య భవనాల నిర్మాణం, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు, ఎంఎస్ఎంఈ ల సర్వే తదితర అంశాలపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.ఎస్.జవహర్ రెడ్డి జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి సూచనలను జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కార్యాలయం వీసీ సమావేశ మందిరం నుండి కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమార్, ఆర్డీవో పెద్ది రోజుతో కలసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1.40,000 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోనే 20,000 వరకు ఉన్నాయ న్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ ఏకీకృతపోర్టల్‌లోకి జిల్లాలోని ఎంఎస్ఎంఈ పరిశ్రమల వివరాలు నమోదుకు నిర్వహిస్తున్న సర్వేపై సచివాలయ ఎమినిటీస్, ఇంజనీరింగ్ సెక్రటరీలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పరిశ్రమల శాఖతో పాటు, టెక్స్‌టైల్, నైపుణ్యాభివృద్ధి తది తర శాఖలను భాగస్వామ్యం చేస్తూ సర్వేను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వే జరుగుతన్న తీరును ప్రతిరోజు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నామని కలెక్టర్ వివ రించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు మదన మోమన్‌శెట్టి, డిప్యూటీ డైరక్టర్ సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గోపీకృష్ణ, సీపీవో శేషశ్రీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీఐపీఎం రత్నమన్మోహన్ పాల్గొన్నారు.

'మే' లో అవగాహన సదస్సు

గుంటూరు(తూర్పు), మార్చి2: రిటర్న్ దాఖలు చేయడం, సాఫ్ట్ వేర్‌లో ఏర్పడే సమస్యలపై ఆదాయ పన్నుశాఖ ఆధ్వర్యంలో మే నేలలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ చీఫ్ కమీషనర్ బి బాలకృష్ణ అన్నారు. శనివారం నగరంపాలెంలో ఆదాయపన్ను శాఖ కార్యాలయంలో ఆడిటర్లు, జిల్లా అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సంద ర్భంగా సొసైటీ,ట్రస్ట్‌ల రిజిస్ట్రేషన్ సమయంలో ఏర్పడే ఇబ్బం దులు గురించి అలాగే రిటర్న్ దాఖలు చేసే సమయంలో సాఫ్ట్‌వేర్‌లో ఉండే ఇబ్బందులను వీ.బాలకృష్ణ దృష్టికి ఆడిటర్లు తీసుకువచ్చారు. అనం తరం ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇతర సమస్యలను పరిష్కరి స్తామని, అలాగే అవగాహన సదస్సు నిర్వహించి అనుమానా లను నివృత్తి చేస్తామని హామీ ఇచ్చారు.